www.kalamdaily.com

కలం

ప్రజల గళం..

బుధవారం
11-02-2026


Follow on:
Kalamtelugu

# SINGLE PAGE TOPIC 360°

## ఫోన్ ట్యాపింగ్

**ఫోన్ ట్యాపింగ్... కుటుంబాల మధ్య చిచ్చు పెట్టింది. అధికారుల కెరీర్‌ను అయోమయంలో పడేసింది. రాజకీయ నాయకులు పదవులు కోల్పోయేలా చేసింది. ప్రభుత్వాలను కూల్చేసింది. పార్టీల ఉనికిని ప్రశ్నార్థకం చేసింది! సరిగ్గా 40 ఏండ్ల కింద కర్నాటకలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నాటి సీఎం రామకృష్ణ హెగ్డేను చుట్టు ముట్టాయి. ఏకంగా ఆయన పదవికే ఎసరు తెచ్చాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోనూ ఇలాంటి ఆరోపణలే! స్వయంగా నాటి సీఎం కేసీఆర్ కూడా విచారణను ఎదుర్కొంటున్నారు. ఇది ఏవైపు దారితీస్తుందోనని బీఆర్ఎస్ ఆందోళన చెందుతున్నది. కర్నాటక, తెలంగాణలోనే కాదు.. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా అనేక రాష్ట్రాల్లోనూ ఫోన్ ట్యాపింగ్ వివాదాలు ఉన్నాయి. వాటి పర్యవసానాలు ఇంకా వెంటాడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కలం 360 డిగ్రీస్ ఎక్స్‌క్లూజివ్..**

- తెలంగాణ బ్యూరో, కలం





# నాడు హెగ్డే.. నేడు కేసీఆర్

## ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు

### ఊడిన హెగ్డే సీఎం పదవి

కర్నాటక సీఎంగా ఉన్నప్పుడు రామకృష్ణ హెగ్డే ఫోన్ ట్యాపింగ్ అపవాదును మూటగట్టుకున్నారు. అప్పటి ఆ రాష్ట్ర మంత్రి దేవెగౌడ, అజిత్‌సింగ్ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. దీంతో ఎక్కడో నిఘానేత్రం ఇద్దరి మధ్య మాటల్ని వింటున్నదనే అనుమానం వచ్చింది. పార్లమెంటుదాకా ఈ వ్యవహారం వెళ్లింది. అప్పటి కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి బీర్ బహదూర్ సింగ్ క్లారిటీ ఇచ్చారు. దేవెగౌడ పేరుతో ఉన్న మూడు నెంబర్లను కర్నాటక ప్రభుత్వం ట్యాపింగ్ చేసినట్లు రాతపూర్వకంగా తెలిపారు. ఆ రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీఐజీ ఆదేశాల మేరకు 'బెంగళూరు టెలిఫోన్స్' జనరల్ మేనేజర్ తగిన టెక్నికల్ సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందించినట్లు తెలిపే ఆధారాలను పార్లమెంట్ ముందు ఉంచారు. చివరకు సీఎం పోస్టు నుంచి హెగ్డే తప్పుకున్నారు.

### మూడేండ్ల పాటు ట్యాపింగ్

ఇంటెలిజెన్స్ డీఐజీ 1985 ఆగస్టు 30న ఇచ్చిన ఆదేశం మేరకు అప్పటి రాష్ట్ర మంత్రి దేవెగౌడకు చెందిన మూడు నెంబర్లను రాష్ట్ర ప్రభుత్వం ట్యాపింగ్ లిస్టులో పెట్టినట్లు లోక్‌సభ వేదికగా అప్పటి కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి బీర్ బహదూర్ సింగ్ వెల్లడించారు. ఆ తర్వాత 1986 జూన్ 30న ఆ మూడు నెంబర్లలో ఒకదాన్ని లిస్టు నుంచి తొలగించాల్సిందిగా మరో ఆదేశం జారీ అయింది. చివరకు 1988 జూలై 27న మరో రెండు నెంబర్లను కూడా లిస్టు నుంచి తొలగించేలా ఇంటెలిజెన్స్ డీఐజీ వేర్వేరు ఆదేశాలు ఇచ్చారు. 'బెంగళూరు టెలిఫోన్స్' జనరల్ మేనేజర్ మాత్రం తమ డిపార్టుమెంట్ ట్యాప్ చేయలేదని, ప్రభుత్వానికి టెక్నికల్ సహకారమిచ్చామన్నారు. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885 లోని సెక్షన్ 5(2) ప్రకారం ట్యాపింగ్ జరిగింది. ఈ వివరణంతా 1988 ఆగస్టు 9న పార్లమెంట్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల రికార్డుల్లో ఇప్పటికీ అందుబాటులో ఉన్నది.

**అధికారాన్ని అడ్డం పెట్టుకుని చట్ట విరుద్ధంగా 51 మంది ఫోన్లను ట్యాప్ చేసి అప్పట్లో హెగ్డే సీఎం పదవి పోగొట్టుకున్నారు. తెలంగాణలోనూ ఫోన్ ట్యాపింగ్ ఉచ్చులో కేసీఆర్ చిక్కుకున్నారు. పదేండ్లపాటు పవర్‌లో ఉండి దందాలకు తెగబడ్డారని, పచ్చని కాపురాల్లో నిప్పులు పోశారంటూ ముఖ్యమంత్రి రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. "సిగ్గుండాలె.. సొంత అల్లుడి ఫోన్ ట్యాప్ చేస్తరా" అంటూ కేసీఆర్‌పై ఆయన కూతురు సైతం ఫైర్ అయ్యారు. ఎంతమంది ఫోన్లు ట్యాప్ అయ్యాయన్నది ఇప్పటికీ లెక్క తేలలేదు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టులు, జడ్జీలు, సినిమా యాక్టర్లు... చివరికి సొంతింటివారి ఫోన్లనూ వదల్లేదన్న నిందలు కేసీఆర్‌ను వెంటాడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులెవరు.. పాత్రధారులెవరు... కర్త, కర్మ, క్రియ ఎవరు.. ఇప్పుడు దాన్ని తేల్చే పని సిట్ వంతయింది.**



## 1988లో దేశాన్ని కుదిపేసిన కర్నాటక ఫోన్ ట్యాపింగ్

**సొంత మంత్రి దేవెగౌడ సహా 51 మందిపై హెగ్డే సర్కార్ నిఘా**

**లోక్‌సభ వేదికగా ప్రకటించిన అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ**

**చివరికి సీఎం పదవిని కోల్పోయిన రామకృష్ణ హెగ్డే**

## తెలంగాణలోనూ 'కేసీఆర్ అండ్ కో'పై ఫోన్ ట్యాపింగ్ విచారణ

**ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను విచారించిన సిట్**

**ఇది ఏ వైపు దారితీస్తుందోనని బీఆర్ఎస్ కేడర్ పరేషాన్**



### తెలంగాణలో ముగింపు ఎక్కడ?

కర్నాటకలో నాలుగు దశాబ్దాల క్రితం దుమారం రేపినట్లుగానే ఇప్పుడు తెలంగాణను ఫోన్ ట్యాపింగ్ వివాదం కుదిపేస్తున్నది. ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావు లాంటి ప్రజాప్రతినిధులను సిట్ ప్రశ్నించింది. అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం ఉన్న స్టేట్ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సహా రాధాకిషన్‌రావు, భుజంగరావు, ప్రణీత్‌రావు, తిరుపతన్న తదితర పోలీసు అధికారులను కూడా ప్రశ్నించి.. వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. మరికొద్దిమందికి నోటీసులు ఇచ్చి ఎంక్వయిరీకి రావాల్సిందిగా కోరుతున్నది. దాదాపు రెండేండ్లుగా తెలంగాణలో కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు ఎప్పుడు ముగుస్తుంది?.. ఎక్కడ ముగుస్తుంది?.. ఎవరు బాధ్యులు?.. ఎవరు బాధితులు?.. అనేది తేలాల్సి ఉంది. నాడు కర్నాటకలో సీఎం పదవికి హెగ్డే రాజీనామాతో ఆ వివాదం ముగిసింది. తెలంగాణలో ముగింపు ఎలా అనేది ఆసక్తికరం.

### 51 మంది బాధితులు

**కర్నాటకలో నాడు హెగ్డే ప్రభుత్వం మొత్తం 51 మంది ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి లోక్‌సభ వేదికగా వెల్లడించారు. దేవెగౌడ, ఆయన కుమారుడు హెచ్‌డీ బాలకృష్ణ, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత వీరప్పమొయిలీ, గుండూరావ్, కేఎన్ నంజెగౌడ, హెచ్‌ఎల్ నంజెగౌడ, హెచ్‌టీ రెడ్డి, ఇబ్రహీం, కేహెచ్ పాటిల్ (లంకేశ్ పత్రిక ఎడిటర్), బీఎల్ శంకర్, జీఆర్ ఇంజనీరింగ్ వర్క్స్ ప్రై.లి., రాజశేఖర్ షెట్టి, వి.అనురాధ, పి.లంకేష్, హీరాలాల్ మోతీలాల్, చెన్నెగౌడ, గురుపాద స్వామి (ఎంపీ), బాలకృష్ణ గౌడ, మున్నెగౌడ, రఘుపతి (మంత్రి), రషీద్ అజియా మెమన్ (ఆర్ఎస్ఎస్), సుబ్బయ్య, వీరేంద్రపాటిల్.. ఇలా మొత్తం 51 మంది ఉన్నారు.**

### జైపాల్ రెడ్డి ఫోన్ కూడా..



నాడు కర్నాటక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై లోక్‌సభలో ఎంపీలు మధు దండావతే, సి.మాధవరెడ్డి అడిగిన ప్రశ్నలపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి సమాధానం ఇచ్చిన అనంతరం చర్చ జరుగుతున్న సందర్భంగా అప్పటి ఎంపీ జైపాల్‌రెడ్డి సైతం జోక్యం చేసుకున్నారు. తన ఫోన్ కూడా ట్యాప్ అవుతున్నదని స్పీకర్‌కు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తుకు ఆదేశిస్తే ఆధారాలు ఇవ్వడానికి సిద్ధమన్నారు. దర్యాప్తు జరిపించడానికి కేంద్రం ఎందుకు వెనకాడుతున్నదని ప్రశ్నించారు. ఎంపీ హెచ్ఎన్ నంజెగౌడ సైతం 1985 నుంచి మాత్రమే కాదని, హెగ్డే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తన ఫోన్ ట్యాప్ అవుతున్నదన్నారు. వ్యక్తిగత హక్కులు, గోప్యత ప్రమాదంలో పడిందన్నారు. ఇది తీవ్రమైన తప్పిదమని, రాజ్యాంగ ఉల్లంఘనా చర్య అని అన్నారు.

### చట్ట ఉల్లంఘన చర్యే: రాజీవ్‌గాంధీ



ఫోన్ ట్యాపింగ్ వివాదంపై లోక్‌సభలో చర్చ జరుగుతుండగా మధు దండావతె సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. దర్యాప్తు జరపడంపై ప్రధాని రాజీవ్‌గాంధీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ స్పందిస్తూ.. "కర్నాటకలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ టెలిగ్రాఫ్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. ప్రజా ప్రతినిధుల ఫోన్‌లు ట్యాప్ కావడం చాలా సీరియస్ అంశం. బహుశా కర్నాటక ప్రభుత్వం కూడా ప్రజాప్రతినిధుల ఫోన్‌లను ట్యాపింగ్ చేయాలని కోరి ఉండకపోవచ్చు. కానీ, ఉల్లంఘన మాత్రం జరిగింది. ఏం జరిగిందో తప్పకుండా పరిశీలిస్తాం. ఇకపైన ఉల్లంఘనలు జరగకుండా అవసరమైతే చట్ట సవరణ చేస్తాం. ఫోన్‌లు ట్యాపింగ్ అవుతున్నట్లు చాలామంది సభ్యులు ఇప్పుడు చెప్తున్నారు. ట్యాపింగ్ కంటే మెరుగైన పద్ధతులు చాలా వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏ ప్రజాప్రతినిధి ఫోన్‌ను ట్యాప్ చేయలేదు. చేయడంపై ఎవరికీ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. క్రిమినల్ యాక్టివిటీస్‌తో సంబంధం ఉన్న వ్యక్తుల, సంస్థల ఫోన్‌లను మాత్రమే ట్యాప్ చేయడానికి టెలిగ్రాఫ్ చట్టం అనుమతిస్తుంది" అని లోక్‌సభ ద్వారా వివరణ ఇచ్చారు.




### 2014: చత్తీస్‌గఢ్


అజిత్ జోగి

చత్తీస్‌గఢ్‌లో 2014లో జరిగిన అంతగఢ్ ఉప ఎన్నిక సందర్భంగా జరిగిన ఆడియో టేపుల లీక్ ఉదంతం దుమారానికి దారి తీసింది. ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ తరఫున మంతూరామ్ పవార్ పోటీ చేశారు. అయితే నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడానికి కొద్ది నిమిషాల ముందు నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో బీజేపీ అభ్యర్థి భోజరాజ్ నాగ్‌కు విజయం సులభమైంది. ఈ ఉపసంహరణ వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాలు ఉండగా.. 2015 డిసెంబర్‌లో ఆడియో టేపులు బయటికొచ్చాయి. పవార్ తన నామినేషన్ ఉపసంహరించుకోవడానికి భారీ మొత్తంలో నగదు చేతులు మారిందని ఆరోపణలు వచ్చాయి. మాజీ సీఎం అజిత్ జోగి, అతని కొడుకు అమిత్ జోగి, అప్పటి బీజేపీ సీఎం రమణ్ సింగ్ అల్లుడు పునీత్ గుప్తా, పవార్ సంభాషణలు ఆడియో టేపుల్లో ఉన్నాయి.

### 2020: రాజస్థాన్


అశోక్ గెహ్లాట్

2020లో రాజస్థాన్ రాజకీయ సంక్షోభం సమయంలో సచిన్ పైలెట్, ఆయన వర్గం ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాప్ అయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. తన సర్కార్ పడిపోయే ప్రమాదం ఉందని అశోక్ గెహ్లాట్ భావించారు. కొంతమంది ఎమ్మెల్యేలు ఇతర పార్టీలతో చేతులు కలిపి తిరుగుబాటు చేయడానికి ప్లాన్ చేస్తున్నారని అనుమానించారు. ఈ క్రమంలో ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నాడు అశోక్ గెహ్లాట్ ఓఎస్డీ లోకేశ్ శర్మ కామెంట్లు వైరల్ అయ్యాయి. "2020 జులై 16న సీఎం అశోక్ గెహ్లాట్ నాకు ఒక పెన్‌డ్రైవ్ ఇచ్చారు. అందులో సచిన్ పైలెట్, ఇతర ఎమ్మెల్యేల ఫోన్ రికార్డింగ్‌లు ఉన్నాయి. వాటిని మీడియా సంస్థలకు లీక్ చేయాలని ఆదేశించారు" అని ఆయన తెలిపారు.

### 2021: మహారాష్ట్ర


రష్మీ శుక్లా

సాధారణంగా అధికార పార్టీ.. ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేయిస్తుంటుందన్న ఆరోపణలు ఉంటాయి. కానీ, మహారాష్ట్రలో ప్రతిపక్ష నేత సూచన మేరకు అధికార పార్టీ నేతల ఫోన్లను ఒక మహిళా ఐపీఎస్ ఆఫీసర్ ట్యాప్ చేశారనే ఆరోపణలు రాజకీయాలను హీట్ ఎక్కించాయి.

- మహారాష్ట్రలో 2021లో శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఐపీఎస్ ఆఫీసర్ రష్మీ శుక్లా స్టేట్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ (ఎస్ఐడీ) చీఫ్‌గా ఉన్నారు. ఆ టైమ్‌లో అప్పటి ప్రతిపక్ష నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఒక పెన్‌డ్రైవ్‌ను బయటపెట్టారు. పోలీస్ బదిలీల్లో అక్రమాలు జరిగాయని, ఐపీఎస్ రష్మీ శుక్లా పంపిన నివేదికను సీఎం ఉద్ధవ్ థాక్రే తొక్కిపెట్టారని ఆయన ఆరోపించారు.
- ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్రతిపక్ష నేతల సూచనలతో కీలక నేతల ఫోన్లను రష్మీ శుక్లా ట్యాప్ చేశారని అప్పటి హోంమంత్రి దిలీప్ వాల్సే పాటిల్ తెలిపారు. ఆమెపై కేసులు పెట్టారు. కానీ తర్వాత బీజేపీ సర్కార్ ఏర్పడడం, రష్మీపై కేసులన్నీ క్లోజ్ కావడం, ఆమె మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీగా నియమితులు కావడం జరిగింది.

## నీరా రాడియా టేపులు

2010లో బయటపడిన నీరా రాడియా ఆడియో టేపుల వ్యవహారం 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణాన్ని వెలికితీసింది. నీరా రాడియా అనే మహిళ.. ఒక కార్పొరేట్ లాబీయిస్టు. ఆమె 'వైష్ణవి కార్పొరేట్ కమ్యూనికేషన్స్' అనే సంస్థ ద్వారా వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులకు పనులు చేసిపెట్టేది. కేవలం 9 ఏండ్ల కాలంలోనే రూ.300 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలను సృష్టించింది. దీంతో నీరా రాడియా వ్యాపారాలపై ఐటీ శాఖ దృష్టిపెట్టింది.

- 2008 ఆగస్టు నుంచి దాదాపు 10 నెలల పాటు నీరా రాడియా ఫోన్లను ఐటీ శాఖ ట్యాప్ చేసింది. సుమారు 5,800 ఫోన్ కాల్స్‌ను రికార్డు చేసింది. ఈ టేపులను 2010లో మీడియా బయటపెట్టడంతో 2జీ స్కామ్ ప్రపంచానికి తెలిసింది.

**బ్లాక్‌బెర్రీ బ్రాండ్ ఇమేజ్.. డ్యామేజ్**

- నీరా రాడియా బ్లాక్‌బెర్రీ ఫోన్లను వాడేవారు. వాటిని ట్యాప్ చేసిన ఐటీ శాఖ.. ఆమె ఫోన్ కాల్స్‌ను వినగలిగింది. కానీ మెసేజ్‌లను చదవలేకపోయింది. డిక్రిప్షన్ టెక్నాలజీని తమకు ఇవ్వకపోతే.. దేశంలో బ్లాక్‌బెర్రీ ఫోన్లను నిషేధిస్తామని కేంద్రం హెచ్చరించింది. దిగొచ్చిన కంపెనీ భారత భద్రతా సంస్థలకు యాక్సెస్ ఇచ్చింది. అప్పటి వరకు సెక్యూరిటీ పరంగా బెస్ట్ ఫోన్ అని బ్లాక్‌బెర్రీకి ఉన్న బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది.

